నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 6 నవంబర్ 2024 | KAMAREDDY

అక్రమ డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలి

బీవీఎం ప్రతినిధుల డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్

కామారెడ్డి, నవంబర్ 5 : అక్రమ డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలని బీవీఎం (భారతీయ విద్యార్థి మోర్చా) రాష్ట్ర కార్యదర్శి విఠల్ అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కొంత మంది ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖాధికారి సహకారంతో వారికి కావాల్సిన చోటికి డిప్యుటేషన్లను వేయించుకుంటున్నారని ఆరోపించారు.గతంలో ఇదే విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే డిప్యుటేషన్లను రద్దు చేయాలని జిల్లా అధికారికి చెప్పారని గుర్తుచేశారు. కానీ ఒకటి రెండు మాత్రమే రద్దు చేసి మళ్లీ డిప్యుటేషన్ ఇస్తున్నారని ఆరోపించారు. దీంతో విద్యార్థులు చదువుకు దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. పిల్లలు ఉన్న పాఠశాలలో విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయులు, వారికి భారం కాకుండా విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల వైపు చూస్తున్నారని ఆరోపించారు. దూరప్రాంతాల నుంచి రావడానికి ఇబ్బందికరంగా ఉండడంతో డిప్యుటేషన్ తీసుకుంటున్నారని అన్నారు. సమావేశంలో బీవీఎం రాష్ట్ర కార్యదర్శి రవితేజ, ఉపాధ్యక్షుడు అర్బాస్ ఖాన్, నాయకులు శివ, శ్రావణ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.


మరో టీచర్‌కు సర్దుబాటు కోరుతూ డీఈవోకు రాసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

ఒక టీచర్‌కు సర్దుబాటు చేయాలని కోరుతూ డీఈవోకు జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఎండార్స్‌మెంట్

- కాంగ్రెస్ ఎమ్మెల్యేల సిఫారసులకు అధికారుల వంతపాట
- కామారెడ్డి జిల్లాలో విచ్చలవిడిగా టీచర్ల సర్దుబాటు
- ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు
- ప్రభుత్వ ప్రొసిడింగ్స్‌కు వ్యతిరేకంగా చర్యలు
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

సర్కారు జీవోకు సర్దుపోటు

విద్యాశాఖలో వింత ధోరణి

నిజామాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) ఏ ప్రభుత్వమైనా చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా పని చేస్తుంటుంది. విధానపరమైన మార్గదర్శకాలు జారీ చేసి వాటిని కచ్చితంగా అమలు చేస్తుంటుంది. కానీ మన రాష్ట్రంలో మాత్రం అందుకు విరుద్ధంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నది. రేవంత్ సర్కారు స్వతహాగా జారీ చేసిన జీవోలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. సాక్షాత్తు సీఎం అట్టిపెట్టుకున్న విద్యాశాఖలో నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతున్నది. ఎమ్మెల్యేల జోక్యంతో ఇష్టానుసారంగా టీచర్ల డిప్యుటేషన్లు, సర్దుబాట్లు చేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 11 నెలల కాంగ్రెస్ పరిపాలనలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో కింది స్థాయిలో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయి. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖలో అడుగడుగునా ఎమ్మెల్యేలే ఉల్లంఘనలకు పాల్పడుతూ ప్రభుత్వ ప్రొసిడింగ్స్‌కు తూట్లు పొడుస్తున్న ఉదంతాలు కామారెడ్డి జిల్లాలో జోరుగా వెలుగు చూస్తున్నాయి. ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు స్వయంగా సిఫార్సు చేసిన లేఖలను ఆధారంగా చేసుకుని విద్యాశాఖ అధికారి ఇష్టానుసారంగా డిప్యుటేషన్లు, సర్దుబాట్లు పేరుతో టీచర్లకు స్థాన చలనం కల్పించడం తీవ్ర దుమారం రేపుతున్నది. అధికార పార్టీ ఎమ్మెల్యేలు లేఖలను కళ్లకద్దుకుంటూ డీఈవో విచ్చలవిడిగా టీచర్లను మార్చేస్తుండడం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గ్రామీణ ప్రాంతాల్లో సర్దుబాటు చేయాలని సర్కారు ఆదేశిస్తే, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

వందల్లో సర్దుబాట్లు..

కాంగ్రెస్ సర్కారు జారీ చేసిన మార్గదర్శకాల మేరకు సర్దుబాట్లకు కొన్ని నిబంధనలు ఉన్నాయి. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేనప్పుడు, వివిధ అవసరాలు ఉన్నప్పుడు సంబంధిత కాంప్లెక్స్ హెడ్ మాస్టర్, మరో సీనియర్ హెడ్ మాస్టర్, ఎంఈవోతో కూడిన కమిటీ భేటీ కావాలి. ఇందులో అవసరాలను గుర్తించి అదే మండలంలో సర్దుబాట్లను చేయాలి. కానీ కామారెడ్డి జిల్లాలో మాత్రం అలాంటిదేమీ జరగడం లేదు. సర్దుబాట్ల పేరుతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యే లేఖలతో కొందరు, ఉపాధ్యాయ సంఘాల లీడర్ల పైరవీలతో మరికొందరు, లంచాలు ఎర వేసి ఇంకొందరు.. ఇలా రకరకాలుగా వివిధ మండలాల్లో పని చేస్తున్న వారంతా పట్టణాలు, పట్టణ సమీప ప్రాంతాలకు సర్దుబాటు పేరుతో వచ్చేస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి దెబ్బతింటున్నది. తెలిసీ తెలియక్కో ఎమ్మెల్యేలు లేఖలు జారీ చేస్తే వాటిని బూచీగా చూపిస్తూ డీఈవో ఇష్టారీతిన ఉత్తర్వులు జారీ చేస్తుండడం చర్చనీయాంశమవుతున్నది. సర్దుబాట్ల ద్వారా సుమారుగా వందకిపైగా టీచర్లు తమ పోస్టింగ్ జాగాను వదిలేసి ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్నారు. రాజకీయ నాయకులతో సంబంధాలు, ఆర్థికంగా బలంగా ఉన్న వారు, యూనియన్ లీడర్లతో అంటకాగుతున్న చాలా మంది టీచర్లకు డీఈవో తీరు కలిసొస్తున్నది. ఈ సర్దుబాట్ల వెనుక భారీగా ముడుపులు ముడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై విచారణ చేయిస్తే దొంగ లెక్కలన్నీ బయటపడే అవకాశాలున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

సాక్ష్యాలివిగో..

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌లో కె.స్వప్న ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. తన కుటుంబ సభ్యుల ఆరోగ్య కారణాల రీత్యా సర్దుబాటు కోసం ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు విన్నవించుకున్నారు. దీంతో స్పందించిన ఆయన.. అదే నియోజకవర్గంలోని సదాశివనగర్ మండలం పద్మాజీవాడికి బదిలీ చేయాలంటూ డీఈవోకు ఎండార్స్‌మెంట్ చేశారు. దీంతో నిబంధనలను గాలికొదిలేసిన డీఈవో ఆమెను నాగిరెడ్డిపేట నుంచి కదిలించేశారు. ఇదేమని అడిగితే ఎమ్మెల్యే లేఖ ఇచ్చారు. సర్దుబాటు చేశానంటూ డీఈవో చెబుతున్నారు.

జుక్కల్ మండలం కౌలాస్ జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో ఏనుగు సతీశ్ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. కామారెడ్డిలో నివాసముండే అతడి భార్య కూడా ప్రభుత్వ ఉద్యోగి కావడంతో కుటుంబ అవసరాల పేరు చెప్పి స్థానిక ఎమ్మెల్యే దగ్గరి నుంచి సిఫార్సు లేఖను తెచ్చుకున్నాడు. దీంతో డీఈవో సర్దుబాటుకు ఓకే చెప్పాడు. విశేషమేమిటంటే జుక్కల్ నియోజకవర్గం నుంచి ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని మత్తమాల అనే గ్రామానికి సర్దుబాటు చేశారు. మత్తమాలలో ఉన్న మరో టీచర్‌ను కామారెడ్డికి పంపించారు.

అవసరాలు ఏ విధంగా ఉన్నప్పటికీ, మానవీయ కోణంలో ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలు అందించినప్పటికీ, అధికారులు నిబంధనలు కచ్చితంగా పాటించడం తప్పనిసరి. కానీ విద్యాశాఖ అధికారులు మాత్రం ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. పైగా, ఎమ్మెల్యేలు ఇచ్చిన సిఫారసు లేఖలకు సంబంధించిన అంశాల్లోనూ ఉల్లంఘనలకు పాల్పడ్డారు. 2021లో ఇచ్చిన జీవో నం.25ను. ఆ జీవోను ఉటంకిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్‌లో జారీ చేసిన ప్రొసిడింగ్స్‌కు సైతం తూట్లు పొడిచారు. జుక్కల్ మండలం బస్వాపూర్ నుంచి సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లికి, నాగిరెడ్డిపేట మండలం చీనూర్ నుంచి ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే స్కూల్ అసిస్టెంట్‌ను డీఈవో ఆఫీస్‌కు డిప్యుటేషన్‌పై మార్చారు.

లింగంపేట మండలంలోని ఓ హైస్కూల్ నుంచి కామారెడ్డి లోకల్‌కు ఒకరిని కదిలించారు. ఎల్లారెడ్డి బాలికల హైస్కూల్‌లో పని చేసే స్కూల్ అసిస్టెంట్‌ను పాల్వంచకు డిప్యూటేషన్‌పై పంపించారు. రామారెడ్డి మండలం పోసానిపేట నుంచి కామారెడ్డి పట్టణానికి ఒకరిని, భిక్కనూర్ మండలం నుంచి మాచారెడ్డికి మరొకరిని కదిలించారు. ఇలా ఎంతో మందిని నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా కదిలించారు.

విచారణ జరిపించాలి..

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కామారెడ్డి విద్యాశాఖలో డిప్యుటేషన్లు చేపడుతున్నారు. జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల విద్యాశాఖ అధికారులు కలిసి సర్దుబాటు పేరుతో అక్రమాలు చేస్తున్నారు. ఈ విషయంపై సమగ్రంగా విచారణ చేస్తే అనేక బాగోతాలు బయటపడే అవకాశాలున్నాయి. ప్రభుత్వ పెద్దలను, ఎమ్మెల్యేలను కొంత మంది విద్యాశాఖ అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారు. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి.

- చకినాల అనిల్ కుమార్, టీపీటీఎఫ్(తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్) రాష్ట్ర నాయకుడు

పంచాయతీలో 'అవినీతి జలగలు'పై ఆరా!

- నివేదికను కోరిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- మంత్రి సీతక్క దృష్టికి 'నమస్తే తెలంగాణ' కథనం
- సోషల్ మీడియాలోనూ చక్కర్లు



నిజామాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న అక్రమాల బాగోతంపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సీరియస్ అయ్యారు. పంచాయతీ కార్యదర్శులతోపాటు డీపీవోలో పని చేస్తున్న ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్న తీరుపై నివేదిక కోరారు. పంచాయతీ కార్యాలయంలో కొంతకాలంగా కొనసాగుతున్న అక్రమాలపై నమస్తే తెలంగాణ దిన పత్రికలో 'అవినీతి జలగలు' శీర్షికతో ఈ నెల 5న కథనం ప్రచురితమైంది. ఈ కథనం పంచాయతీ కార్యాలయంలోని దుస్థితిని కళ్లకు కట్టింది. దీనిపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు స్పందించి ఆరా తీశారు. మరోవైపు ఇదే వ్యవహారంపై నిఘా వర్గాలు సైతం సమగ్ర సమాచారాన్ని సేకరించాయి. ఎవరెవరు డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు? ఏండ్లుగా డీపీవోలో పాతుకుపోయి వ్యవస్థకు చెడ్డ పేరు తీసుకువస్తున్న ఉద్యోగుల తీరుపైనా వివిధ వర్గాల నుంచి సమాచారాన్ని రాబట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇంటెలిజెన్స్ వర్గాలు నివేదికను రూపొందిస్తున్నట్లు సమాచారం. డీపీవోలో అక్రమాలపై 'నమస్తే తెలంగాణ' కథనం.. సమీకృత కలెక్టరేట్‌లో సంచలనం రేపింది. కలెక్టర్ చాంబర్, అదనపు కలెక్టర్ల కార్యాలయానికి కూత వేటు దూరంలోనే కొనసాగుతున్న ఈ అక్రమాల తంతును వెలుగులోకి తీసుకువచ్చినందుకు 'నమస్తే తెలంగాణ'ను అభినందించారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు హర్షాతిరేకలు వ్యక్తంచేస్తున్నారు. డీపీవోలో వేధింపులకు గురిచేస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలంటూ 'నమస్తే' కథనాన్ని మంత్రి సీతక్కతోపాటు పంచాయతీ రాజ్ ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిసింది. సోషల్ మీడియాలోనూ నమస్తే తెలంగాణ కథనం చక్కర్లు కొట్టింది.

నాగన్న బావిని పరిశీలిస్తున్న కలెక్టర్

కాటేజీల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

లింగంపేట మండల కేంద్రంలోని నాగన్న బావి పరిసరాల్లో కాటేజీల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన నాగన్న బావని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాగన్న బావిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి మరింత కృషి చేయాలని సూచించారు. పర్యాటకుల సౌకర్యార్థం నాగన్న బావి పరిసరాల్లో కాటేజీలు ఏర్పాటు చేయాలని సూచించారు. నాగన్న బావిలోని నీటిలో ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. పరిసరాల్లో నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బావి సందర్శనకు వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. పురాతన కట్టడాలు, వాటి చరిత్రపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట అధికారులు ఉన్నారు.

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

లింగంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ అశీష్ సంగ్వాన్

లింగంపేట/నాగిరెడ్డిపేట్/ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 5: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన లింగంపేట మండలంలోని మెంగారం, లింగంపేట, నాగిరెడ్డిపేట మండలంలోని మేల కుంట తండా. తాండూర్, ఎల్లారెడ్డి మండల పరిధిలోని శివ్వాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని పరిశీలించి తూకం వేయాలని సూచించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటది వెంట రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం తరలింపులో లారీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌కు సూచించారు. ధాన్యం తూకం వేసిన వెంటనే రైతు, బ్యాంకు ఖాతా వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రెండు, మూడు రోజుల్లో రైతులకు డబ్బులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు.

ఇంటింటి సర్వేకు సర్వం సిద్ధం

మోర్తాడ్, నవంబర్ 5: నిజామాబాద్ జిల్లాలో ఇంటింటి సర్వేకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 15రోజుల పాటు నిర్వహించనున్న ఈ సర్వేలో నేటి నుంచి మూడు రోజులు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబాల వారీగా స్టిక్కర్లు అతికిస్తారు. 9 నుంచి సమగ్ర సర్వే ప్రారంభం కానున్నది. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి 75 ప్రశ్నలకు సంబంధించి వివరాలు సేకరిస్తారు. సర్వే పూర్తయిన తరువాత ఆయా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఇంటింటికీ తిరుగుతూ చేపట్టే ఈ సర్వే భవిష్యత్తు ప్రభుత్వ పథకాలకు కీలకం కానున్నది. సర్వే కోసం జిల్లా వ్యాప్తంగా 3,236 మంది ఎన్యుమరేటర్లను నియమించగా, అదనంగా 107 మందిని రిజర్వుగా తీసుకున్నారు. సూపర్‌వైజర్లుగా 369 మంది తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు సర్వేను పర్యవేక్షించనున్నారు.

సమగ్ర వివరాల సేకరణ..

సర్వేలో కుటుంబానికి సంబంధించి పూర్తిస్థాయి వివరాలు సేకరిస్తారు. కుటుంబ ఆదాయం, ఆదాయ వనరులు, భూముల వివరాలు, గల్ఫ్ వెళ్లిన వారి వివరాలు, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు, పశుసంపద, రేషన్‌కార్డు, వాహనాలు, ఇంధన ఖర్చు, ప్రభుత్వం ద్వారా పొందిన పథకాల వివరాలు, పొందిన ప్రయోజనాలు ఇలా అన్నింటినీ సేకరించనున్నారు.

15 రోజుల పాటు..

2014లో సమగ్ర కుటుంబ సర్వే జరగగా, దశాబ్దకాలం తరువాత ఇంటింటి సర్వే కొనసాగనున్నది. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించారు. 2011 జనగణన ప్రకారం ఒక్కో ఎన్యుమరేటర్‌కు బ్లాక్‌లను కేటాయించారు. ఎన్యుమరేటర్లు బ్లాక్‌ల వారీగా కుటుంబాలకు సంబంధించి స్టిక్కర్లు అతికిస్తారు. బ్లాక్‌లో కుటుంబాల సంఖ్య 75 దాటితే మరో ఎన్యుమరేటర్‌ను కేటాయిస్తారు. ఒక్కో ఎన్యుమరేటర్ ఒక ఇంటి సర్వే పూర్తి చేయడానికి అరగంట కేటాయించాల్సి ఉంటుంది. రోజుకు పది ఇండ్ల చొప్పున, 15 రోజుల్లో 150 కుటుంబాల వివరాలు సేకరించాల్సి ఉంటుంది. ఎన్యుమరేటర్లుగా అంగన్‌వాడీ టీచర్లు, జీపీ కార్యదర్శులు, ఆశవర్కర్లు, సీఆర్పీలు, వివిధ శాఖల సిబ్బందిని తీసుకున్నారు. ప్రాథమిక పాఠశాల టీచర్లకు సైతం బాధ్యతలు అప్పగించారు.

ప్రజల్లో అనుమానాలెన్నో..?

సర్వేలో భాగంగా ఆదాయం, ఆస్తుల వివరాలు సేకరిస్తుండడంపై జనాల్లో అనేక సందేహాలు నెలకొన్నాయి. సర్వే ప్రకారం కుటుంబాల పరిస్థితి ఏమిటి, ఆదాయ వనరులేమిటి, ప్రభుత్వ పథకాలేమైనా తీసుకున్నారా లేదా, వెనుకబడిన కుటుంబాలు ఏవి అనే వివరాల ప్రకారం భవిష్యత్తులో పథకాలు వర్తిస్తాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కార్తీకం.. శుభప్రదం

- శైవ క్షేత్రాలకు పండుగ శోభ
- నెలంతా భక్తుల సందడి
- 21 రోజులు దివ్యమైన ముహూర్తాలు

సుభాష్‌నగర్, నవంబర్ 5: కార్తీక మాసం అంటేనే పూజలు, వ్రతాలకు ప్రత్యేకం. కార్తీక దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తే పుణ్యఫలం దక్కుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ మాసంలో తులసి పూజను దైవ స్వరూపంగా భావిస్తారు. ఆదిదేవుడు పరమశివుడికి ప్రీతికరమైన కార్తీకమాసం డిసెంబర్ ఒకటి వరకు కొనసాగనున్నది. కార్తీక మాసోత్సవాలకు జిల్లాలోని శివాలయాలు, వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. నెలరోజులపాటు భక్తులు నిష్టతో ప్రాతఃకాల అభిషేకాలు, దీపారాధనలు చేస్తే అత్యంత ఫలప్రదం. నెలరోజుల పాటు శివాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగనున్నాయి.

15న కార్తీక పౌర్ణమి

- ఈనెల 15న కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని శంభులింగేశ్వరాలయం, నీలకంఠేశ్వరాలయం, ఓంకారేశ్వరాలయం, మార్కండేయ మందిరం, శ్రద్ధానంద్ గంజ్ ఉమామహేశ్వరాలయాలతో పాటు సుభాష్‌నగర్, బడాబజార్ రామాలయాల్లో విశేష పూజలు, సహస్రదీపాలంకరణలు, జ్వాలాతోరణం, ఆకాశదీపం కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

దీపారాధనలు, వనభోజనాలు

- కార్తీక మాసంలో కార్తీక పురాణ పఠనంతో పాటు ఉదయం, సాయం త్రం దీపారాధనలు,వనభోజనాలు చేయడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. వాతావరణంలో వచ్చే మార్పులకు అనుగుణంగా మానవుల్లో ధార్మిక చింతన భక్తివికాసం కలిగించడానికి తులసి, ఉసిరిక వృక్షాల కింద పిండి, ఉసిరి దీపాలు వెలిగించడం, పండితులకు దీపదానాలు చేయడం తదితర పూజలతో భక్తులకు వైకుంఠ, కైలాస ప్రాప్తి, మహిళలకు అఖండ సౌభాగ్యం కలుగుతుందని కార్తీక పురాణం చెబుతోంది.

ముఖ్యమైన రోజులు

- కార్తీక మాసంలో శుభకార్యాలకు శివపూజలకు అనుకూలమైన మాసం. 12న బోధనైకాదశి, 13న చిలుక ద్వాదశి, తులసీలగ్నాలు, సత్యనారాయణ వ్రతాలు, 14న వైకుంఠ చతుర్దశి, చాతుర్మాస దీక్ష సమాప్తి, 15న కార్తీక పౌర్ణమి, తులసీ, ఉసిరిక లగ్నాలు, సత్యనారాయణ వ్రతాలు, 19న సంకష్ట చతుర్దశి, 26న ఏకాదశి, 29న మాసశివరాత్రి, డిసెంబర్ ఒకటిన కార్తీక బహుళ అమావాస్య, డిసెంబర్ 2 మార్గశిర మాసం ఆరంభం.

వేలాది వివాహాలు

- రాబోవు రెండు నెలలు దివ్యమైన శుభముహూర్తాలు ఉన్నాయి. వేలాది వివాహాలు జరగనున్నాయి. రెండు నెలల పాటు మంచి ముహూర్తాలు ఉన్నాయని పంచాంగకర్తలు చెబుతున్నారు. వాయిద్యాలు, మండపాలు, క్యాటరింగ్, ఫొటోగ్రాఫర్లు, కూలీలకు చేతినిండా పనులు దొరకనున్నాయి.

ఫంక్షన్ హాళ్లు దొరకని పరిస్థితి

- ఉమ్మడి జిల్లాలోని ఫంక్షన్ హాళ్లలో వసతులను బట్టి ఒకరోజు అద్దె రూ. 40వేల నుంచి రూ. 3లక్షల వరకు వసూలు చేస్తున్నారు. పెండ్లిల సీజన్ మొదలు కావడంతో వాటి ధరలు అమాంతం పెంచేశారు. ఫంక్షన్‌హాళ్లు లభించని వారు దేవాలయ ప్రాంగణాలు, ఇండ్ల వద్ద, ఖాళీ ప్రదేశాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

శుభ ముహూర్తాలు

- నవంబర్ 7, 8, 9, 10, 13, 14, 15, 16, 17, 22, 24, 25 28, డిసెంబర్ నెలలో 5, 6, 7, 8, 9, 10, 13, 14, 15, 18, 26